డా॥ రాళ్లబండి కవితా ప్రసాద్

# అగ్నిహంస



# అగ్నిహంస

**(కవిత్వం)**

రచన :

**డా॥ రాళ్లబండి కవితాప్రసాద్**



**కిన్నెర పబ్లికేషన్స్**
2-2-647/153,
సెంట్రల్ ఎక్సైజ్‌కాలనీ, హైదరాబాద్ - 500 013.
ఫోన్ : 040-27426666

**అగ్నిహంస (కవిత్వం)** H *రచన :* **డా॥ రాళ్లబండి కవితాప్రసాద్** H ప్రథమ ముద్రణ: ఫిబ్రవరి 2011, H ప్రతులు : 1000 H వెల:రూ. 100/- H ప్రతులకు : © **డా. రాళ్లబండి కవితాప్రసాద్**, ఫ్లాట్ నెం. 203, టింబు ఎన్‌క్లేవ్, మోతీనగర్ - ఎర్రగడ్డ, హైదరాబాద్-500 018. ఆం.ప్ర. ఫోన్ : 040-23835748, సెల్ : 9949492626 E-mail : kavithaprasadrv@yahoo.com H ప్రచురణ : **కిన్నెర పబ్లికేషన్స్**, 2-2-647/153, సెంట్రల్ ఎక్సైజ్‌కాలనీ, హైదరాబాద్ - 500 013. ఫోన్ : 040-27426666 H డిటిపి : **సమంత గ్రాఫిక్స్**, ఎస్.ఆర్.టి.8, జవహర్‌నగర్, హైదరాబాదు-500 020. ఫోన్ : 27670198

గింజ మొలకెత్తేటంతటి
సమయంలో
కాలం కవిత్వమౌతుంది,
చినుకు సూర్యుని ప్రేమలో పడేంతటి
క్షణంలో
ఆకాశం రాగాల హరివిల్లవుతుంది
పిట్ట రెక్కలుగామారే
ప్రయత్నంలో
స్వేచ్ఛ కథ అవుతుంది,
ఊరు నిద్దుర లేచేదాకా
నేను సాహిత్యమౌతూనే ఉంటాను.



## కిన్నెరవాణి

ఇది 'కిన్నెర' 78వ ప్రచురణ. గత 33 ఏళ్లకు పైగా సాహిత్య, సంగీత, నృత్య కార్యక్రమాల నిర్వహణలో 'కిన్నెర' తనదైన రాశిని, వాసిని పెంచుకుంటూ వస్తుంది. భారతీయ సంప్రదాయ సాంస్కృతిక వైభవానికి పునరుజ్జీవనం కల్పించడానికి యథాశక్తి కృషి చేస్తూవస్తుంది.

ప్రస్తుతం మీ చేతుల్లోకి **'అగ్నిహంస'** కవిత్వం వాలింది. కృతికర్త డా।। రాళ్లబండి కవితాప్రసాద్ గారు. అగ్రశ్రేణి అష్టావధాన, శతావధాన, ద్విశతావధాన శేఖరులు. సంప్రదాయ కవిత్వంలో విద్వత్కవిగా సుప్రసిద్ధులు. అనేక కావ్య, నృత్యరూపకాల కర్త. ఆధునిక కవిత్వంలోనూ సమర్థమైన కవి. ప్రాచీన, అర్వాచీన సాహిత్యాల సమర్థసమ్మేళనం డా।। కవితాప్రసాద్ గారు.

గత సంవత్సరం కవితాప్రసాద్ గారు రచించిన **"ఒంటరిపూల బుట్ట"** సచిత్ర కవిత్వ సంపుటిని కిన్నెర ప్రచురించింది. తెలుగు సాహిత్యరంగంలో అద్భుతమైన కవిత్వ పరిమళాలు వెదజల్లింది. ఎందరో అభిమానుల్ని ఈ కవితా సంపుటి సంతరించుకుంది. ఈ గ్రంథం హిందీ, సంస్కృతం, ఇంగ్లీషు భాషల్లో కూడా అనువదించబడింది. సంస్కృతానువాదం ప్రచురితమైంది కూడా. **'ఒంటరిపూల బుట్ట'** గ్రంథాన్ని ప్రచురించినందుకు కిన్నెర గర్విస్తోంది.

డా।। కవితాప్రసాద్ గారి **'అగ్నిహంస'**. యాభై కవితల సమాహారం.

ఒక పరిణత కవి ప్రకృతితో, సామాజిక సంవేదనలతో మమైక్యమై మనసు భాషతో తన హృదయఘోషను కవితాత్మకంగా వెలువరించిన కావ్యమిది. కవితాప్రసాద్ గారి పద్యం ఎంత పొగరుగా, బిగువుగా ఉంటుందో, వచనకవిత్వం అంత గంభీరంగా, పదచిత్రాలతో, చమత్కారాలతో, ఆధునిక కాలానికి అద్దం పట్టే భావాలతో సాగుతుంది.

కవికి కవితాశక్తి, సత్కవిత్వయుక్తి ఉండాలే గాని పద్యమైనా, వచన కవిత్వమైనా, పాటైనా, గేయమైనా, ఏరూపమైనా సమస్య కాదు. ఆ రచన పాఠకునికి సూటిగా చేరుతుంది –

**"అగ్నిహంస"** ఆధునిక కవిత్వ సంపుటాల్లో ఒక అనర్ఘరత్నంలా నిలుస్తుందని **'కిన్నెర'** నమ్మకం.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ఉన్నతాధికారిగా సంక్షేమశాఖలలోను, సాంస్కృతిక శాఖలోను, తిరుమల తిరుపతి దేవస్థానంలోను ఎన్నో ఉన్నతోద్యోగాలు నిర్వహిస్తూనే నిరంతరం సాహిత్య సృష్టి చేయడం కవితాప్రసాద్ గారి ప్రత్యేకత.

ఈ 'అగ్నిహంస'ను ప్రచురించే అవకాశం **'కిన్నెర పబ్లికేషన్స్'**కు కల్పించిన డా।। రాళ్లబండి వారికి హృదయపూర్వక ధన్యవాదాలు సమర్పిస్తున్నాం.

భవదీయులు

**రొద్దం ప్రభాకరరావు**,ఐపిఎస్ (రి.)
అధ్యక్షులు
కిన్నెర పబ్లికేషన్స్

**మద్దాళి రఘురాం**
కార్యదర్శి
కిన్నెర పబ్లికేషన్స్

## అగ్నిహంస విహారం లో .....


| | |
|---|---|
| స్వప్నమండలం | 1 |
| ప్రాణ తాండవం | 4 |
| ఊహ... జ్ఞాపకం... | 6 |
| ఇవ్వాళే ఇలాఐంది.... | 11 |
| వేయి వికర్షణలమధ్య | 14 |
| అతి అసహజంగా... | 17 |
| నీమదిలోపలి చీకటిలో.... | 19 |
| ఒక నిశ్చల చలనం గురించి... | 22 |
| రాళ్లని ప్రేమిస్తున్న వేళ... | 24 |
| సమూహానికి ఆవల... | 27 |
| స్వార్ధ పంజరం | 30 |
| వి'ముక్తకం' | 32 |
| నేనొక సమాధానాన్ని ప్రశ్నించండి ప్లీజ్! | 34 |
| శబ్దం నిద్రిస్తోంది...! | 36 |
| ఆకాశంలో "జామెట్రీ"... | 38 |
| యుద్ధం శరణం గచ్ఛామి! | 40 |
| "ది లాస్ట్ ఫుల్ స్టాప్" | 45 |
| మనసు జలదరించిన వేళ... | 48 |
| దారి తప్పినదారి... | 50 |
| ఎడారి గురించి... | 52 |
| కాల సంకోచం | 54 |
| దేవుడు పారేసుకున్న ఆకాశం | 56 |
| అలలకు తెలియని పడవ | 60 |
| వెలిగే చీకటి | 64 |
| లాస్‌వేగాస్ | 67 |
| మనిషిదే భాష? | 69 |
| నిర్జీవితం... | 71 |
| రెండు రెళ్లు రెండే! | 73 |
| తార్కిక మర్కటం | 76 |
| నిర్వికల్ప సంకల్పం | 78 |
| విలయవిలాసం | 80 |
| అందరికీ తెలిసిన అపరిచితుణ్ణి... | 82 |
| రెండు గాంధర్వాలు | 84 |
| నేను... | 85 |
| రెండు ఏకాంతాలు | 87 |
| రెండు అనంతాలు | 89 |
| పుష్పాపచయం | 92 |
| నువ్వు ... | 94 |
| 'కల'కాలం | 95 |
| ష్ ... మౌనం శబ్దిస్తోంది | 97 |
| మనస్సెవరిదెవరిదెవరిది ...? | 98 |
| పద్మపత్ర మివాంభస ... | 99 |
| నిరంతరం అంతరం | 101 |
| జడభరతుని స్వగతం | 102 |
| ఋణగ్రస్థ! | 105 |
| అద్దంలో బొమ్మ | 106 |
| ఎవరూ చదవని పుస్తకం | 108 |
| దిసీజ్ హ్యూమన్ కెమిస్ట్రీ | 109 |
| ... శూన్యమేవావిశిష్యతే- | 111 |

# స్వప్నమండలం

నేనొక స్వప్నాన్ని వెంటాడుతున్నాను...
ఫలితంగా మెలకువను పోగొట్టుకున్నాను.
నా స్వప్నం మనస్సు తోటలోంచి
తప్పించుకు పోయిన మాయలేడి
కనురెప్పల కంచెను దూకి పరుగెత్తిన కంగారు జింక,
దాని పొట్టలో పసిపాపలా నేను!

చెంగు చెంగున గెంతే నా స్వప్నం
నన్ను గతుక్కు మనే గతుకుల అయోమయంలో పడేస్తుంది...
నాకు సన్నిహితంగా ఉండే సుదూరం అది,
నన్ను అసత్యంగా మార్చే సత్యం అది,
నన్ను బ్రతికించే మృత్యువు అది...
నన్ను మిథ్యా ఇంద్రధనుస్సుగా మార్చే కన్నీటిచుక్క అది...

నేను నా స్వప్నాన్ని వెంటాడుతున్నాను...
వాస్తవాల కాంతి నేత్రాల వలయాలు దాటి,
అనుభవాల హాలాహలాల సముద్రాల కెరటాల మీదుగా



తప్పించుకుపోయిన
నా ఊహానుభూతుల స్వప్నకన్యను వెంటాడుతున్నాను...
వాస్తవాల కాంతి నేత్రాల వలయాలు దాటి,
కంటికందకుండా కదలిపోయే కల అది!
ఎప్పుడూ అవతలి తీరానికి పారిపోయే అల అది!
ఒక ఉన్మత్తక్షణంలో పుట్టి,
మరో తన్మయ రోచిస్సులో పెరిగి,
ఇంకొక ఆత్మీయ వీచికతో సౌందర్యాన్నద్దుకుని,
ఆపై అర్థంకాని ప్రహేళికలా అద్భుతాన్ని సృష్టించి,
అనంతరం గుండె చుట్టు శృంగారపు వరదగుడిలా మారి,
హఠాత్తుగా మాయమై పోయిన మోహన స్వప్నమది!
నా స్వప్నాన్ని వెంటాడుతున్నాను...
ఇది పోగొట్టుకున్న స్వప్నం కాదు
పారిపోయిన స్వప్నం!
నా సామీప్యంలో నా కల ఒక కుందేలు పిల్ల–
నా అన్వేషణలో నాకల ఒక మాయలేడి–
నాకు దూరమైపోయినపుడు ఒక సింహం–
నాపై వాలినప్పుడు ఒక వసంతం!
నాకు దక్కనప్పుడు శూన్యం...
పరుగెత్తే స్వప్నం వెనుక
ప్రవహించే నదిలా నేను
తప్పించుకుపోయిన స్వప్నం కోసం
దుఃఖించే పక్షిలా నేను...

మాయమైపోయిన స్వప్న సాక్షాత్కారానికి
మౌనంగా తపించే మనస్సులా నేను...
ఏ స్వప్న వాటికలో విశ్రమిస్తోంది నా కల?
ఏ కలల బిలంలో వ్రేలాడుతుంది స్వప్నపు గబ్బిలం?
నేను నా స్వప్నాన్ని వెంటాడుతున్నాను... అలసిపోయాను–
వెనుతిరిగి చూశాను... ఆశ్చర్యం!
నా కోసం మరో స్వప్నం వెతుకుతోంది
నన్ను మాయలేడిగా... కుందేలు పిల్లలా...
సింహంలా... వసంతంలా... గబ్బిలంలా... భావిస్తూ
వెతుకుంది మరో స్వప్నం!
దాని వెనుక మరోకల... ఆ మరో కల వెనుక–
మరో కలల అల
ఓహో!
ఇదొక స్వప్నాల వేటలా ఉంది
ఊహల దీపస్తంభాల నీడల్లో
ఊరేగుతున్న ఉన్మత్తుల బాటలా ఉంది!
తాళంచెవులు పారేసుకుని
తనకూ బీరువాయేలేదని నమ్మే అసమర్థుని మాటలా ఉంది...!
అనంతమైన కలల వెన్నెలలు వాలిన కోటలా ఉంది!
నేనిప్పుడు ఒక స్వప్నమండలంలో ఉన్నాను.



## ప్రాణ తాండవం

ప్రాణం ఒకనది

పదార్థాలదరుల నొరుసుకుంటూ
కాలంలోకి సహస్ర ముఖాలుగా ప్రవహిస్తుంది
ప్రాణం ఒకనది!

చెట్టు తలపై చుట్టుకున్న గింజల జటాజూటంలోని ప్రాణం
ఒక నిశ్శబ్ద మందాకిని–
మట్టి మనస్సులో వెచ్చని రసాయనాల ఆలోచనల్లోని ప్రాణం
ఒక రహస్య స్రోతస్విని–
గాలి ఊహల ఉయ్యాలలో క్షణాలై ఊగే కణాలలోని ప్రాణం
ఒక సందిగ్ధ స్వప్న సంకేతం–
జీవ పదార్థాల్లోని ప్రణయ సంకల్పంలోని ప్రాణం
ఒక రసానంద జలపాతం–

ప్రాణం ఒకనది!

భగవంతుడి నిత్య చైతన్య స్వరఝరి ప్రాణం!
ప్రతిశిలనూ హృదయంగా మార్చే
రామపాద గోదావరి ప్రాణం...!

ప్రాణానిది బహిరంగంగా కనిపించే
రహస్యం–
ప్రాణానిది నిశ్శబ్దంగా వినిపించే
సంగీత స్వరం!
బిందువు విశ్వంలా వ్యాపించి
తిరిగి బిందువుగా సంకోచించే
శాక్తేయ డోలనం ప్రాణం–
జనన మరణాల 'ప్లస్ మైనస్'లతో
కాలం తీగలో కదిలే విద్యుత్ ప్రయాణం ప్రాణం!
ప్రాణం ఒకనది–!
ఆనకట్ట కట్టి ఆపాలని చూస్తే
పాతాళంలోకి ఇంకిపోతుంది!
వేగాన్ని పెంచి పరిగెత్తించాలంటే
పరమహంసలా ఎగిరిపోతుంది!
అనువైన ప్రతి అణువులో
లయాత్మకకణాల నృత్యవిలాసంలో
శివతాండవం చేస్తుంది ప్రాణం–
అనువు కానప్పుడు
కాలంలో లీనమై
మరో సృష్టికి అవసరమైన
మహా మౌనంగా మారుతుంది!



# ఊహ... జ్ఞాపకం...

సముద్రానికి మేఘం – ఒక వెచ్చటి ఊహ
మేఘానికి వర్షం ఒక చల్లని జ్ఞాపకం
ఇప్పుడు ఊహలు–జ్ఞాపకాల గురించి మాట్లాడుకుందాం...!

అంతరిక్షం ఒక ఊహ–
నక్షత్రాలన్నీ జ్ఞాపకాలే!
కాలంతాలూకూ ఊహ– ప్రాణం
ప్రాణంతాలూకూ జ్ఞాపకం – పదార్థం.
ప్రతి ఊహా జ్ఞాపకంగా మారదు, కానీ
ప్రతి జ్ఞాపకం వెనుక ఒక ఊహ తప్పదు!
గతాన్ని తవ్వుకుంటే బయటపడే నిశ్చలసరస్సు– ఊహ
గుండెల్లోకి వెలుతురు ఊహ ప్రవేశిస్తే చాలు
చీకటి ఉనికిని కోల్పోతుంది!
చీకటికి వెలుతురొక మృత్యు జ్ఞాపకం–
వెలుతురు ఊహల్లో చీకటిది అస్తిత్వ సమస్య!
పదహారేళ్ల పిల్లకు పంచవన్నెల రామచిలక ఒక ఊహ!
పంజరంలో రామచిలకకు పక్షి గూడొక జ్ఞాపకం!

కాలం చెట్టు కొమ్మల్లో
మనిషి ఊహలసాలెగూడు అల్లుతూ కూర్చుంటాడు
అదృష్టం పురుగులు వచ్చిపడతాయని!
వెన్నెల ఊహల్తో తిరిగే చందమామకు
అమావాస్య ఒక కఠిన జ్ఞాపకం–
బాల్యానికి యౌవ్వనం ఒక పరుగెత్తే ఊహ–
యౌవనానికి వార్ధక్యం ఒక ఊహకందని జ్ఞాపకం–
వార్ధక్యానికి ఊహలుండవు అన్నీ, జ్ఞాపకాలే–
ఊహలకు ఎన్నో రంగులుంటాయి, కానీ
జ్ఞాపకాలన్నీ నలుపు తెలుపుల్లోనే–
ఊహలకు ఎన్నో అదృశ్యశరీరాలుంటాయి, కానీ
జ్ఞాపకాలన్నీ భద్రపరచిన శవపేటికలే!
కాలంలోకి పొగలా వ్యాపిస్తుంది ఊహ–
గతాన్ని తడుముకుంటుంటే గుండెలా తగులుతుంది జ్ఞాపకం!
ఊహలు– మనిషి మెదడు ప్రతిక్షణం ప్రసవించే శిశువులు!
జ్ఞాపకాలు–మనిషి మనస్సు శ్రుతి తప్పకుండా పాడే జోలపాటలు!
జ్ఞాపకాలు – ఊహల సౌధానికి పునాదులు
ఊహలు – జ్ఞాపకాల గోపురానికి పతాకలు!



# అగ్నిహంస

విచక్షణ లేకుండా తగలబడుతున్న అరణ్యంలోకి
విచిత్రంగా వచ్చిందొక హంస.
అడుగుపెట్టంగానే హంసపాదు!
అడవి నిండా అగ్ని...
పాలు–నీళ్లు వేరు చేయడం తెలుసుకానీ
అడవిని అగ్నిని విడదీసేవిద్య దానికి రాదు...
చెట్టుమీద వాలితే చిగురుల్లా
చిమిడి పోతాననుకుని
మేధావులమౌనంలా ఉన్న నల్లరాయి శిరస్సుపై
వాలింది హంస!
అప్పటికే వేడెక్కిన రాతినిశ్శబ్దం
పక్షిపాదాలకు నెత్తురుపారాణి పూసింది.
ఇక రెక్కలకు పనిచెప్పింది హంస–

విచక్షణ లేకుండా తగలబడుతూనే ఉంది అరణ్యం

ఎక్కడో వెదురుపొదల్లో గుప్పుమన్న నిప్పులు–
వేల వేణువులు చిట్లిన గొంతులతో పాడే ధూమవిషాదరాగం!

సంవత్సరాలనే ఊడలుగా లెక్కపెట్టుకుంటున్న
మర్రికొమ్మల్లో అగ్ని–
ఋషుల గడ్డాలు చురచుర కాలుతున్న వాసన!
హంస క్రేంకియారావాలు చేస్తుంది – ఎవ్వరికీ వినపడడంలేదు
గొంతెత్తి మేఘాల్ని పిలుద్దామని
అడివిలో ధర్మశాస్త్రంలాఉన్న కొండకొన మీద వాలింది,
మూఢనమ్మకాల్లాంటి ముళ్లపొదల్లో ఇరుకుంది హంస–!
“ఖర్మ” అనుకుని పైకి ఎగిరింది...

విచక్షణ లేకుండా అరణ్యం తగులబడుతూనే ఉంది!!!

“అడవుల్లో హంసలకు ఏం పని?” అనుకుంటూ
పక్షుల వరుసలు ప్రశ్నార్థకాల్లామారి పైపైకి ఎగురుతున్నాయి–
బలహీనుల ఆలోచనల్లా మంటల్ని చూసి పారిపోతున్నాయి–
గూళ్లల్లో పిట్టకూనల్ని వదలలేక తల్లిపక్షులు తల్లడిల్లుతున్నాయి–
చెట్టుమీద నుంచి జారిపోతున్న నమ్మకాల్లా
పక్షిగూళ్లు బూడిదలా రాలిపోతున్నాయి!
లకుముకి పిట్టల భయంతో
బెరడు క్రింద దాక్కున్న పురుగులు
పిట్టలకన్నా వేగంగా పరుగెడుతున్నాయి–

విచక్షణలేకుండా అరణ్యం తగులబడుతూనే ఉంది!

హంస మాత్రం అడవిలో అగ్నిమూలాల కోసం
వెతుకుతోంది...
కోరలు చాచే చారిత్రక కుట్రల్లాంటి సర్పాలు
ఎండుటాకుల మధ్యనుంచి జరజరా పారిపోతున్నాయి!



ఖాళీ పుట్టల్లోంచి పాముబుసల్లా పొగలు! పొగలు! పొగలు!
అడవిలోని ‘మృగస్వామ్యం’లో వ్యాపించే అక్రమాల్లా
పరుగెడుతున్నాయి జంతువులు–

విచక్షణా రహితంగా తగులబడుతోంది అరణ్యం!

అగ్నిబిందువు ఆరంభాన్ని వెతుకుతుంది హంస,
దావాగ్ని కేంద్రాన్ని అన్వేషిస్తోంది హంస,
తొలినిప్పురవ్వకోసం గాలిస్తోంది హంస!

విచక్షణా రహితంగా తగులబడుతోంది అరణ్యం!

సంఘర్షించుకునే రెండు సిద్ధాంతాల్లాంటి
ఏ చెట్లకొమ్మల్లో పుట్టిందో ప్రథమాగ్ని!?
సమాధానం దొరకని ఏ ఆలోచన రాపిడిలో
పుట్టిందో ఈ కార్చిచ్చు!?
వలసవచ్చిన ఏ పక్షి ముక్కులోంచి
రాలిపడిందో ఈ నిప్పుకెరడు!!
ఉనికిని కోల్పోతున్న
ఏ ఉగ్రవాద వృకోదరాలలో పుట్టిందో ఈ క్షుధాగ్ని

విచక్షణా రహితంగా తగులబడుతోంది అరణ్యం!

ఏటవాలుగా ఎగిరేహంస
మంటలగాలిలో కదుల్తోంది,
హంస రెక్కలకు నిప్పంటుకుంది...
అయినా ఎగురుతూనే ఉంది హంస–
రెక్కల చిచ్చు ఆర్పి ఎవరో రక్షిస్తారని కాదు–
అగ్నివార్త అందరికీ తెలియాలని!!

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=416**